
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 25 । మే । 2024



చీనీ టన్ను రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 776 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



ఎస్కేయూలో కొత్త టెక్ కోర్సులు
విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేస్తున్న ఎస్కేయూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంజినీరింగ్‌లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. 8లో

గరిష్టం/కనిష్టం
39.5°/24.9°
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కొన్ని మండలాల్లో తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

నేడు అక్కడక్కడా వర్షాలు



అనంతపురం అగ్రికల్చర్: తుపాను ప్రభావం ఒడిశా, పశ్చిమబెంగాల్‌కు మళ్లిపోవడంతో రాగల ఐదు రోజులు పొడి వాతావరణం ఉంటుందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.సహదేవ రెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. శనివారం మాత్రం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదు కావచ్చన్నారు. మిగతా నాలుగు రోజులు వర్షసూచన లేదన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 34.6 నుంచి 38.5 డిగ్రీలు, కనిష్టం 24.8 నుంచి 26.4 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 6 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వేసవి దుక్కులు చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ, ఇతర పంటల సాగుకు వీలుగా నాణ్యమైన అనువైన విత్తనాలు, అలాగే ఎరువులు అందుబాటులో పెట్టుకోవాలని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించండి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మంజువాణి



అగళి ఆస్పత్రిలో మందుల నిల్వ వివరాలు పరిశీలిస్తున్న మంజువాణి

అగళి: ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి (డీఎంహెచ్‌ఓ) మంజువాణి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆమె...అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, ఆస్పత్రిలో నిల్వచేసిన మందులను పరిశీలించారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

పుట్టపర్తి: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన మొదటి సంవత్సరం పరీక్షకు 1,250 మంది హాజరు కావాల్సి ఉండగా 1,177 మంది హాజరయ్యారు, అలాగే ఒకేషనల్‌కు సంబంధించి 122 మందికి గాను 110 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, పరీక్షల కన్వీనర్ రఘునాథరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 255 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 228 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌కు సంబంధించి 61 మందికి గాను 58 మంది హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా మౌలిక వసతులు కల్పించినట్లు పరీక్షల కన్వీనర్ వెల్లడించారు.

పోలీసు సోదాలు ముమ్మరం



ఓ ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు సోదాలు ముమ్మరం చేశారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పాత నేరస్తులు, రౌడీషీటర్ల నివాసాల్లో సోదాలు చేశారు. పలు మండలాల్లోని సమస్యాత్మక గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పోలీసులు గ్రామసభలు నిర్వహించారు. కౌంటింగ్ రోజున అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వ ఉంచితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ వేసినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎవరైనా బెట్టింగ్ ఆడుతున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

తొలి ఫలితం పుట్టపర్తిదే!

అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఓట్ల లెక్కింపు మరో 10 రోజుల్లో జరగనుంది. దీంతో జిల్లా యంత్రాంగం కౌంటింగ్‌కు ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని నియమించడంతో పాటు శిక్షణ సైతం ఇస్తోంది. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టింది.

- ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు ముమ్మరం
- ప్రతి రౌండుకూ 14 టేబుళ్ల చొప్పున ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత



లేపాక్షి సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల కౌంటింగ్ కేంద్రంలో బారికేడ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్‌ఓలు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. కౌంటింగ్ జరిగే లేపాక్షి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, హిందూపురం సమీపంలోని 'బిట్' ఇంజినీరింగ్ కళాశాలలో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నారు. స్ట్రాంగ్ రూంలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు తరచూ వెళ్లి పరిశీలిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఆయా కౌంటింగ్ కేంద్రాల్లో ఒక్కో నియోజకవర్గం ఒక్కో ఫ్లోర్‌లోని గదుల్లో ఈవీఎంలను భద్ర పరిచారు. సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

తీర్పు చెప్పిన 14 లక్షల మంది..

జిల్లాలో 16,56,775 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 14,03,259 మంది ఓటు వేశారు. పుట్టపర్తి నియోజకవర్గంలో అతి తక్కువగా 1,82,090 మంది, ధర్మవరం నియోజకవర్గంలో అత్యధికంగా 2,18,292 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా జిల్లాలోని 14 లక్షల మంది తీర్పు ఎటువైపు ఉందన్నది జూన్ 4వ తేదీన తేలనుంది.

పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభం..

జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభమవుతుంది. పోస్టల్ బ్యాలెట్ల కోసం మడకశిర నియోజకవర్గానికి 2 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. కదిరికి అత్యధికంగా 4 టేబుళ్లు, తక్కిన అన్ని నియోజకవర్గాలకు మూడేసి టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు సర్వీస్ ఓటర్ల కోసం అదనంగా నియోజకవర్గానికి ఒక టేబుల్ ఏర్పాటు చేయనున్నారు. ఇక ఈవీఎంల ఓట్ల లెక్కింపు 8.30 గంటలకు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయనున్నారు. అలాగే హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికీ 14 టేబుళ్ల ఏర్పాటు చేయనున్నారు. సర్వీస్ ఓటర్ల ఓట్లు కోసం 5 టేబుళ్ల ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఒక్కో టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్, ఒక అసిస్టెంట్, ఒక అటెండర్ కలిపి నలుగురు ఉంటారు. ఇక రాజకీయ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు ఇద్దరేసి ఉంటారు. వారి కోసం ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తారు.

చివర్లో ధర్మవరం ఫలితం..

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా తక్కువ రౌండ్లు, తక్కువ పోలింగ్ కేంద్రాలున్న పుట్టపర్తి, మడకశిర నియోజకవర్గాల ఫలితం తొలుత తేలనుంది. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు 18 రౌండ్‌లతో ముగుస్తుంది. దీంతో ఫలితం త్వరగా తేలుతుంది. ఇక అత్యధికంగా ఓటర్లున్న ధర్మవరం నియోజకవర్గానికి 21 రౌండ్లు ఉంటాయి. దీని ఫలితం కాస్త ఆలస్యంగా వస్తుంది. ఒక్కో రౌండు 20 నిమిషాల నుంచి అరగంట పట్టవచ్చు. ఇందులో ఒక రౌండుకు 14 పోలింగ్ కేంద్రాల ఓట్లు లెక్కిస్తారు.

సిబ్బందికి శిక్షణ..

కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి కలెక్టర్ అరుణ్‌బాబు సమక్షంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు.

అసెంబ్లీ నియోజక వర్గాలు	7
పార్లమెంట్ నియోజక వర్గం	1
పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య	104
జిల్లా ఓటర్లు	16,56,775
పోలైన ఓట్లు	14,03,259
పోస్టల్ బ్యాలెట్లు	32,409
ఓట్ల లెక్కింపుకు ఏర్పాటు చేసే టేబుళ్లు	14
కౌంటింగ్ సూపర్‌వైజర్లు	119
కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్లు	119
కౌంటింగ్ అసిస్టెంట్లు	119

జూన్ 1వ తేదీన మరోసారి శిక్షణ ఉంటుంది. ఇక నియోజకవర్గాల్లో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈనెల 26, జూన్ 2వ తేదీన నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం 119 మంది మైక్రో అబ్జర్వర్లను కూడా నియమించారు.

కట్టుదిట్టమైన చర్యలు..

కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించారు. అలాగే కౌంటింగ్ కేంద్రాల వద్ద డ్రోన్‌లు ఎగురవేయడాన్ని నిషేధించారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు, అభ్యర్థులు బాణాసంచా కాల్చడానికి అనుమతి లేదు. ఇప్పటికే పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ పేరుతో అనుమానితుల ఇళ్లను శోధిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ పోయడాన్ని నిషేధించారు. స్ట్రాంగ్ రూంలతో పాటు కౌంటింగ్ కేంద్రాల వద్ద 160 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

హిందూపురం: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు భద్రతా ప్రమాణాలను పక్కాగా పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణబాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన 'బిట్' ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో నియోజకవర్గాల వారీగా జరిగే ఓట్ల లెక్కింపు కోసం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లాగ్ బుక్‌లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్‌ఓలు వంశీకృష్ణ, గౌరీ శంకర్ తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్లకు అనుమతి లేదు

- ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కౌంటింగ్ జరగాలి
- జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ అంతా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జరగాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, ఏఈఆర్‌ఓ, సహాయక సిబ్బందికి ఓట్ల లెక్కింపుపై తొలి విడత అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై



శిక్షణలో పాల్గొన్న ఎన్నికల అధికారులు

పవర్ పాయింట్ ప్రజెంటేషన ఇచ్చారు.

పొరపాట్లకు తావివ్వొద్దు..

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి లెక్కింపు ప్రక్రియను పగడ్బందీగా పూర్తి చేయాలన్నారు. చిన్న పొరపాటుకు సైతం తావివ్వొద్దన్నారు. హిందూపురం పార్లమెంట్‌తో పాటు 6 అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ జిల్లాలోనే జరుగుతుందన్నారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకే లెక్కింపు ప్రారంభమవుతుందని, కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు, సిబ్బంది ఉదయం 6 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. ఒక వైపు పోస్టల్ బ్యాలెట్లు, మరో వైపు ఈవీఎంల లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లు అధికంగా పోలైనందున లెక్కింపునకు అధిక సమయం పడుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకూ వీడియో రికార్డింగ్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డు ధరించాలన్నారు. కౌంటింగ్ హాల్‌లో ఆర్‌ఓలదే సర్వాధికారమన్నారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పక్కాగా ఉండాలి..

జేసీ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గానికి, అసెంబ్లీ నియోజకవర్గానికి పోలైన ఓట్లను ప్రత్యేకంగా లెక్కిస్తామన్నారు. అభ్యర్థులకు పోలైన పోస్టల్ బ్యాలెట్లను వివిధ దశల్లో పరిశీలన చేసి అన్నీ పక్కాగా ఉన్న వాటినే లెక్కింపులోనికి తీసుకుంటామన్నారు. సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, రిటర్నింగ్ అధికారులు భాగ్యరేఖ, వెంకటశివరామిరెడ్డి, గౌరీ శంకర్, సన్నీ వంశీకృష్ణ, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

డీఈఓ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 25న సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న డీఈఓ ఇన్ ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉద్యోగ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన అర్బన్ డీఎస్పీ వాసుదేవన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ, జిల్లాకు చెందిన 110 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందని, కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏపీపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.



నేపాల్ జానపద నృత్యం ప్రదర్శిస్తున్న బాలవికాస్ చిన్నారులు



భక్తిగీతాలు ఆలపిస్తున్న నేపాల్ భక్తులు

బుద్ధం శరణం గచ్ఛామి

- ప్రశాంతి నిలయంలో ముగిసిన బుద్ధ పౌర్ణమి వేడుకలు

ప్రశాంతి నిలయం: బుద్ధుడి నామస్మరణతో ప్రశాంతి నిలయం ప్రతిధ్వనించింది. బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని రెండురోజులుగా ప్రశాంతి నిలయంలో నిర్వహిస్తున్న వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత నేపాల్ బౌద్ధ సన్యాసులు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ 'జయమంగళగాత్'ను నిర్వహించారు. అనంతరం సత్యసాయిని, బుద్ధ భగవానుడిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. వక్తలు బుద్ధుడు, సత్యసాయి తత్వాలను భక్తులకు వివరిస్తూ ప్రసంగించారు. సాయంత్రం నేపాల్ బాలవికాస్ చిన్నారులు తమ సంస్కృతిని ప్రతిబింబించేలా జానపద నృత్యం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.



జయమంగళగాత్‌ను పఠిస్తున్న నేపాల్‌కు చెందిన బౌద్ధ సన్యాసులు

టమాట రేటు.. మిర్చి ఘాటు

- వేసవిలో తగ్గిన కూరగాయల దిగుబడి
- ధరల పెరుగుదలతో సామాన్యులకు ఇబ్బందులు



కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు



హిందూపురం అర్బన్: మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రోజురోజుకూ పెరుగుతూ సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరాయి. దీంతో జనం ఆచితూచి కొనాల్సి వస్తోంది. వేసవిలో జిల్లా వ్యాప్తంగా కూరగాయల దిగుబడి తగ్గడం వల్లే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.


బెంగళూరు నుంచి దిగుమతి..

మామూలు రోజుల్లో జిల్లా నుంచే ఉద్యాన నగరి బెంగళూరుకు కూరగాయలు ఎగుమతి చేసేవారు. కానీ వేసవిలో పరిస్థితి తిరగబడింది. ప్రస్తుతం కూరగాయలన్నీ కర్ణాటక నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో పచ్చిమిర్చి 2 వేల హెక్టార్లు, టమాట 3 వేల హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. కానీ ఎండల దెబ్బకు దిగుబడులు బాగా తగ్గిపోయాయి. మరోవైపు వినియోగం పెరిగింది. దీంతో జిల్లా వ్యాపారులు బెంగళూరు మార్కెట్‌పై ఆధారపడాల్సి వస్తోంది. బెంగళూరు, చిక్కబళాపుర, బాగేపల్లి మార్కెట్‌ల నుంచి నిత్యం మిర్చి, టమాట ఇతర కూరగాయలు 50 లోడ్లు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ సరుకు ఎక్కువగా కదిరి, ధర్మవరం, అనంతపురం, హిందూపురం మార్కెట్‌లకు చేరుతోంది.

అమాంతం పెరిగిన ధరలు..

మామూలు రోజుల్లో పచ్చి మిర్చి కిలో ధర రూ.25 నుంచి రూ.40 మధ్య ఉండేది. టమాట ధర కూడా కిలో రూ.15 నుంచి రూ.20 మధ్య ఉండేది. కానీ దిగుబడులు తగ్గి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. వారంరోజుల క్రితం కిలో పచ్చి మిర్చి ధర రూ.70 ఉండగా, శుక్రవారం ఏకంగా రెండింతలు పెరిగి కిలో రూ.140కి చేరింది. ఇక టమాట గత వారం కిలో రూ.20 నుంచి రూ.22 పలుకగా, ఇప్పుడు ఏకంగా రూ.50కి చేరింది. మిగతా కూరగాయలు కూడా దాదాపుగా రెండింతల మేర పెరిగాయి. రానున్న రోజుల్లో కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

దిగుబడుల్లేకే..



జిల్లాలో కూరగాయల దిగుబడి బాగా తగ్గింది. మరోవైపు వినియోగం పెరిగింది. దీంతో బెంగళూరు నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. రవాణా, ఇతర ఖర్చులు కలుపుకుంటేనే వ్యాపారికి గిట్టుబాటు అవుతోంది. ప్రస్తుతం కిలో పచ్చి మిర్చి రూ.140 నుంచి రూ.150 వరకూ విక్రయిస్తున్నాం. టమాట సైతం కిలో రూ.50 వరకూ విక్రయిస్తున్నాం. వర్షాలు పడి మళ్లీ దిగుబడులు వచ్చే వరకూ ధరలు ఇలాగే ఉంటాయి.
– మోహన్, కూరగాయల వ్యాపారి, చిలమత్తూరు

ఆచీతూచీ కొంటున్నాం



మార్కెట్‌లో కూరగాయల ధరలన్నీ పెరిగాయి. రూ.500 నోటు తీసుకెళ్తే తప్ప కావాల్సినవి తీసుకురాలేని పరిస్థితి. కిలో టమాట, అరకిలో మిర్చి, ఇతర కూరగాయలు, ఆకుకూరలకే రూ.500 అవుతోంది. అందువల్లే ఆచీతూచీ కొనాల్సి వస్తోంది.
– ప్రభావతి, గృహిణి, హిందూపురం

ఉపాధి కూలీల సంఖ్య పెరగాలి



పనులపై సమీక్షిస్తున్న పీడీ విజయేంద్రప్రసాద్

మడకశిర: ఉపాధి పనుల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు రైతులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని సీఎల్‌ఆర్సీ కార్యాలయంలో ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏపీఓలు, ఈసీలు, టీఏలతో నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఉపాధి పనులపై ఆరా తీశారు. ఎంత మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు..ఎన్ని పనులు చేశారు.. తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున భూమి మెత్తగా మారి పనులు చేసేందుకు వీలుగా ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి గ్రామంలోనూ పనులు చేపట్టి అడిగిన వారందరికీ 'ఉపాధి' పనులు కల్పించాలన్నారు. పనుల కల్పనలో ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప, ఈసీ హరిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'108'లో ప్రసవం



శిశువును చూపుతున్న 108 సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆడశిశువుకు జన్మనిచ్చింది. వివరాలు... పుట్టపర్తి మండలం కర్ణాటక నాగేపల్లికి చెందిన సాకే వెంకటేష్ భార్య ముత్యాలమ్మకు శుక్రవారం మధ్యాహ్నం పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ రామ్మోహన్, పైలెట్ శ్రీనివాసులు ఆగమేఘాలపై ఆ గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే నొప్పులు భరించలేక ఇబ్బంది పడుతున్న ముత్యాలమ్మకు ధైర్యం చెప్పి అంబులెన్స్‌లో ఎక్కించుకుని ధర్మవరంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో కొత్తచెరువు మండలం ఆమిద్యాలకుంట వద్దకు చేరుకోగానే నొప్పులు తీవ్రం గాయడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి ఆశ కార్యకర్త నాగమణి సహకారంతో 108 సిబ్బంది ఆమెకు ప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వడంతో తమ ఇంట మహాలక్ష్మి పుట్టిందని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ చైతన్య పాఠశాలలో పాఠ్య పుస్తకాలు సీజ్

కొత్తచెరువు: మండలంలోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అడ్మిషన్లు చేపట్టి, పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నట్లు గుర్తించిన మండల విద్యాశాఖాధికారి జయచంద్ర శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి పాఠ్య పుస్తకాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకుడు నరేంద్ర మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వేసవి సెలవుల్లో ముందస్తు అడ్మిషన్లు చేపట్టి రూ.వేలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రైవేట్‌గా ముద్రించిన పాఠ్య పుస్తకాలు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతులయ్య, నాయకులు మురళి, సంద కిషోర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో కొత్త టెక్ కోర్సులు

- బీటెక్‌లో సీఎస్ఈ డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- ఎంటెక్‌లో స్ట్రక్చరల్, థర్మల్ కోర్సులు
- కంప్యూటర్ సైన్సెస్, ఈసీఈ బ్రాంచ్‌లో భారీగా సీట్ల పెంపు
- ఇండస్ట్రీ-4 టెక్నాలజీ విప్లవానికి అనుగుణంగా నూతన ప్రోగ్రామ్‌లు
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి



ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: నాలుగో పారిశ్రామిక విప్లవం ప్రపంచ పారిశ్రామిక రూపురేఖలను శరవేగంగా మార్చి వేస్తోంది. ఇండస్ట్రీ-4 టెక్నాలజీ విప్లవంతో సరికొత్త ఉపాధి అవకాశాలు విస్తృతంగా దక్కుతున్నాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, వర్చువల్ రియాల్టీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఫుల్‌స్టాక్ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్... ఇలా అనేక నూతన సాంకేతికతలు అందుబాటులోకి రావడంతో పరిశ్రమల రూపురేఖలే మారిపోతున్నాయి. అయితే, ఈ తరహా సాంకేతికతను అందిపుచ్చుకున్న నిపుణులు అందుబాటులో లేకపోవడంతో ఆయా పరిశ్రమలు నిపుణుల కొరత ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఇండస్ట్రీ-4 టెక్నాలజీని ప్రవేశపెట్టడం అనివార్యమైంది. దీంతో భారీగా ఉద్యోగాలు దక్కనుండడంతో ఇంజినీరింగ్ కోర్సుల్లోనూ మార్పులు అనివార్యం అయ్యాయి. మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక విద్యలోనూ మార్పులు తప్పనిసరి అయ్యాయి. అధునాతన ప్రపంచంలో ఎదురయ్యే పోటీని ఎదుర్కొని, ఉద్యోగావకాశాలు దక్కించుకునేలా విద్యార్థులను సంసిద్ధులను చేసే కార్యాచరణకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఎస్కేయూ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే నూతన కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించనున్నారు.

నాలుగు అధునాతన ప్రోగ్రామ్‌లు

ఎస్కేయూలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటికే బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నారు. కొత్తగా బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో సీఎస్ఈ డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ అందుబాటులోకి రానున్నాయి. అలాగే కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌లో ప్రస్తుతమున్న 60 సీట్లను 120కి పెంచారు. కొత్త కోర్సుల్లో ఒక్కో కోర్సుకు 60 చొప్పున సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌కు 120, రెండు కొత్త కంప్యూటర్ అదనపు బ్రాంచ్‌లకు 120 కలిపి మొత్తం 240 కంప్యూటర్ ఇంజినీరింగ్ సీట్లను ఈ విద్యా సంవత్సరంలో భర్తీ చేయనున్నారు. ఎంటెక్‌లో నూతనంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో థర్మల్ ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టారు. బీటెక్‌లో సివిల్, మెకానికల్, సీఎస్ఈ, ఈఈఈ కోర్సులు ఉన్నాయి. ఎంటెక్‌లో ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్, సివిల్, మెకానికల్ కోర్సులు ఉన్నాయి.

పరిశ్రమల యాజమాన్యాలతో ఒప్పందం

కోర్సులోనే పరిశ్రమల అనుభవం గడించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. ఇందుకోసం పరిశ్రమల యాజమాన్యాలతో ఎస్కేయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జెన్సార్, కేపీఐటీ, ఈఎంసీ, ఐబీఎం, పర్‌సిస్టెన్స్ కంపెనీలు ఈ కోవలో ఉన్నాయి. ఇందులో భాగంగానే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనింగ్, పరిశ్రమల సందర్శన, టెక్నికల్ కాంపిటీషన్స్, హైటెక్ లైవ్ ప్రాజెక్ట్స్, గెస్ట్ లెక్చరర్స్, స్పాన్సర్‌షిప్ ఆఫ్ టెక్నికల్ ఈవెంట్స్‌ను నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో కోర్సు పూర్తి చేసిన వారికి కొలువులు విస్తృతంగా దక్కేలా చర్యలు చేపట్టారు.

2023-24 విద్యా సంవత్సరంలో మొత్తం 105 మంది విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కొలువులు దక్కాయి. టీసీఎస్‌లో ఐదుగురు, ఇన్ఫోసిస్- 3, గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీ -20, క్యూ-స్పైడర్ - 35, పెంటగాన్ స్పేస్ -15, పలె టెక్నాలజీస్ -14, విప్రోలో 2, ఇంటలెక్ట్- 1, యాక్సెంచర్ - 3, ప్రాడక్ట్ టెక్నాలజీ-5, హెచ్‌సీఎల్‌లో ఇద్దరు చొప్పున ఎంపికయ్యారు.

కంపెనీ అవసరాలకు తగినట్లుగా...



కంపెనీల అవసరాలకు తగినట్లుగా విద్యార్థులను తర్ఫీదు చేస్తే ఉపాధి అవకాశాలు తప్పక దక్కుతాయి. దీంతో బీటెక్‌లో రెండు, ఎంటెక్‌లో రెండు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాం. 2024-25 విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చాం. ఇంజినీరింగ్ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు, అధునాతన సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవడంతో అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి.

– డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి, వీసీ, ఎస్కేయూ

14 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగావకాశం




ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసిన దృశ్యం

మడకశిర రూరల్: మండలంలోని గుండుమలలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ భాస్కర్, బిట్ కళాశాల ఈఈఈ విభాగాధిపతి గంగాధర్ ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. సాంకేతిక విద్యలో మెరుగైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఇప్పటికే వివిధ కంపెనీల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారని గుర్తు చేశారు. అనంతరం నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో బెంగళూరులోని డుటచ్ ఇండియా పవర్ కన్‌సెక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సంవత్సరానికి రూ.2.2 లక్షల వేతనంతోడిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన 8 మంది విద్యార్థులు, హిందూపురంలోని మంజునాథ పవర్ లూమ్స్, టెక్స్‌టైల్ కంపెనీలో ఏటా రూ.2 లక్షల వేతనంతో ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఆర్డర్ కాపీలను ప్రిన్సిపాల్ మద్దిలేటి అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రదీప్‌కుమార్, శిక్షణ అధికారి రూపేష్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపం కల్లూరు

సందర్భం : నేడు కల్లూరు సుబ్బారావు జయంతి



అనంతపురం కల్చరల్: కొందరు పుట్టుకతోనే గొప్పవాళ్లుగా ఉంటారు. మరికొందరికి ఈ లోకం గొప్పతనాన్ని ఆపాదిస్తుంది. ఈ రెండో కోవలో చాలా కొద్ది మంది మాత్రమే తమదైన వ్యక్తిత్వంతో గొప్పవారవుతారు. 'అనంత' త్యాగధనుడు కల్లూరు సుబ్బారావు నిస్సందేహంగా ఈ కోవకు చెందినవారే. స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించి 1928 నవంబర్‌లో నంద్యాలలో జరిగిన సభలో దత్తమండలాలకు రాయలసీమని పేరు పెట్టిన వారిలో కల్లూరు సుబ్బారావు ప్రముఖులు. నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, ఐదుకల్లు సదాశివన్ వంటి ఎందరో కల్లూరి సుబ్బారావు స్ఫూర్తితో ఆయన శిష్యులుగా జాతీయ స్థాయిలో రాణించారు. అనంత అభివృద్ధి కోసం పరితపించిన ఆయన 1937లో రాయలసీమ వారికి అన్యాయం జరగకుండా 'శ్రీబాగ్ ఒడంబడిక'పై సంతకం చేశారు. స్వాతంత్ర్యానంతరం ఎంతో విలువైన తన సొంత స్థలాన్ని కళాకారుల కోసం (ప్రస్తుతం లలితకళాపరిషత్తు) విరాళంగా ఇచ్చేశారు. 1967లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. త్యాగానికి ప్రతిరూపంగా నిలచిన కల్లూరు సుబ్బారావు 1897, మే 25న హిందూపురం సమీపంలోని కల్లూరు గ్రామంలో జన్మించారు. 1973లో కన్నుమూశారు. ఆయన జయంతి సందర్భంగా ప్రతిష్టాత్మకంగా అందించే 'కల్లూరు సుబ్బారావు అవార్డును' ఈ ఏడాది సామాజిక సేవా కార్యకర్త తరిమెల అమరనాథరెడ్డికి అందజేయనున్నారు. కల్లూరు వారి ఆదర్శప్రాయ జీవితానికి మరింత ప్రాచుర్యం కల్పించేలా జయంతి, వర్ధంతులను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఎలేక్పీ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల వెంకట సుబ్బయ్య, పద్మజ తెలిపారు.

సమాంతరంగా మానవత..

రక్తదాతగా, సీనియర్ రచయితగా జిల్లాకు చిరపరిచితులైన తరిమెల అమరనాథరెడ్డి ఆదర్శప్రాయ సేవాతత్పరుడిగా పేరు గడించారు. దేవుడిపై నమ్మకం తప్పు కాదు కానీ భగవంతుని పేరుతో సాగే దోపిడీకి వ్యతిరేకంగా పలు ఉద్యమాలు చేపట్టారు. 'మానవతా సంస్థ'ను ఏర్పాటు చేసి రక్తదానంపై ప్రజలను నిత్య చైతన్యం చేస్తున్నారు. స్వాతంత్ర సమరయోధుడు కల్లూరు సుబ్బారావు ఆదర్శ వ్యక్తిత్వం తనను కట్టిపడేసిందని చెప్పే ఆయన... కల్లూరు పురస్కారానికి తన ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఎల్‌కేపీలో పురస్కార ప్రదానం..

అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో శనివారం సాయంత్రం కల్లూరు సుబ్బారావు జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు. కల్లూరు సుబ్బారావు పేరిట పురస్కారాన్ని తరిమెల అమరనాథరెడ్డికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అందజేయనున్నారు. ఈ సందర్భంగా లలితకళాపరిషత్తు కళాకారులు 'శ్రీకృష్ణ రాయబారం' పౌరాణిక నాటకాన్ని సీనియర్ నటులు సోమిరెడ్డి, రామాంజనేయులు ప్రదర్శించనున్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: పది, ఇంటర్‌లో ప్రతిభ చాటుకున్న వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను పదో తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 480కు పైబడి మార్కులు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 510కు పైబడి మార్కులు సాధించి ఉండాలి. అలాగే ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు 800కు పైబడి, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు 850కు పైబడి మార్కులు సాధించిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ, సెల్ నంబర్, చిరునామాతో కూడిన వివరాలను 89191 21041 నంబర్‌కు వాట్సాప్ చేయాలి. ఎంపికైన వారికి జూన్ 16న హిందూపురంలోని వాల్మీకి భవన్‌లో పురస్కారాలను అందజేస్తారు.

రెండో రోజూ హుండీల ఆదాయం లెక్కింపు




హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ రెండో రోజు శుక్రవారమూ కొనసాగింది. 50 రోజులకు గాను హుండీలు లెక్కించగా తొలి రోజు రూ.71,70,337, రెండో రోజు రూ.8,24,194 నగదుతో పాటు 21 గ్రాముల బంగారు, 480 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో కంటే ఈసారి ఆదాయం ఎక్కువ వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి రమేష్ బాబు, కదిరి ఎస్‌బీఐ శాఖ మేనేజర్ రాఘవేంద్ర, బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో రోజు కొనసాగిన సిట్ విచారణ

తాడిపత్రి అర్బన్: ఎన్నికల సమయంలో, ఆ తర్వాత తాడిపత్రి చోటు చేసుకున్న అల్లర్లపై సమగ్ర విచారణ చేసి ప్రాథమిక నివేదికను అందజేసిన సిట్ అధికారులు... మరింత లోతైన విచారణలో భాగంగా రెండో విడత తాడిపత్రికి విచ్చేశారు. ఇప్పటికే మూడు రోజులుగా విచారణ కొనసాగింది. నాలుగో రోజు శుక్రవారం కూడా విచారణను అధికారులు చేపట్టారు. మూడు రోజులుగా రూరల్ పోలీస్ స్టేషన్‌లో మకాం వేసిన సిట్ బృందం అల్లర్లకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను శుక్రవారం పరిశీలించింది. ఇప్పటి వరకూ నిందితుల్లో ఎవరెవరిని అదుపులోకి తీసుకున్నారు. ఎంత మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు అనే అంశాలపై పరిశీలిస్తోంది. అంతే కాక అల్లర్లకు ముందు టీడీపీ వర్గీయులు భారీ సంఖ్యలో జేసీ నివాసం వద్దకు ఎలా చేరుకున్నారు అనే విషయంపై సిట్ బృందం లోతుగా విచారణ చేపట్టింది. పక్కా పథకం ప్రకారమే ముందుగానే ఆందోళనకారులు పట్టణంలోకి చొరబడ్డారా? అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి



మృతి చెందిన భానుప్రియ

కూడేరు: మండలంలోని మరుట్ల-1వ కాలనీకి చెందిన కిష్టప్ప కుమార్తె భానుప్రియ(10) విద్యుదాఘాతంతో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గురువారం రాత్రి భానుప్రియ నీటిని వేడి చేసేందుకు హీటర్ స్విచ్ ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై సీఐ శివరాముడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ధర్మవరంలో ఒకరు, జీవితంపై విరక్తితో మరొకరు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు.



వరప్రసాద్ (ఫైల్)

ధర్మవరం అర్బన్/పుట్టపర్తి టౌన్: ధర్మవరంలోని గుట్టకిందపల్లి సమీపంలో పవర్ లూమ్స్ మగ్గాల యజమాని శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన వరప్రసాద్(30) బీటెక్ పూర్తి చేసి పవర్‌లూమ్స్ మగ్గాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఉత్పత్తి చేసిన చీరలు అన్‌సీజన్ కారణంగా అమ్ముడు పోక నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీంతో మనస్తాపానికి గురైన వరప్రసాద్ శుక్రవారం ఉదయం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య మమత, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

- పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ సమీపంలో హరినాథ (26) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. హిందూపురం డివిజన్ రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపిన మేరకు... కొత్తచెరువులోని బీసీ కాలనీకి చెందిన లక్ష్మీదేవి, వెంకట్రాముడు దంపతుల కుమారుడు హరినాథ్(26) కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే మతిస్థిమితం కోల్పోయిన ఆయన శుక్రవారం ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అతిసారం నివారణకు చర్యలు చేపట్టాలి

- డీఎంహెచ్ఓ మంజువాణి, డీపీఓ విజయ్‌కుమార్



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి

రొళ్ల: గ్రామాల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆరోగ్య, పంచాయతీ రాజ్‌శాఖ సిబ్బందికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ మంజువాణి, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. రొళ్ల మండలం కాకి గ్రామంలో అతిసార ప్రబలి నాలుగు రోజులుగా 30 మందికి పైగా బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి, చికిత్సలు అందజేశారు. శుక్రవారం ఉదయం డీఎంహెచ్ఓ, డీపీఓ కాకి గ్రామాన్ని సందర్శించారు. మరింత వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పంచాయతీరాజ్ శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. రక్షిత మంచినీటి కొళాయిలు, ట్యాంకుల శుభ్రం, పైప్‌లైన్ లీకేజీ వంటి సమస్యలపై ఆరా తీశారు. వాంతులు, విరేచనాలు ఉధృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై చైతన్య పరచాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో వాటర్ స్కీమ్ పథకం కింద వచ్చే నీటిని కాకుండా మండల కేంద్రం నుంచి శుద్ధి చేసిన నీటిని ప్రతి ఇంటికీ రోజుకు 80 లీటర్ల చొప్పున ఐదారు రోజుల పాటు ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. వ్యాధి తగ్గు ముఖం పట్టిన నేపథ్యంలో ఇంకా రెండు మూడు రోజుల పాటు వైద్య శిబిరాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, వైస్ సర్పంచ్ రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ లోకేష్, నాయకులు బసవరాజు, యర్రగుంటప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనునాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీమ్, డాక్టర్ సౌందర్య, పీహెచ్ఎస్ సుధారాణి, ఈఓఆర్డీ క్రిష్ణప్ప, ఇన్‌చార్జ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్, ఎంపీహెచ్ఈఓ ఖాదర్‌వలి, కార్యదర్శులు శ్రీనాథ్, రచన, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ కాలనీలో చోరీ

హిందూపురం అర్బన్: స్థానిక డీఆర్ కాలనీలో నివాసముంటున్న హిందూపురం మండలం కొటిపి పంచాయతీ కార్యదర్శి సుహాసిని ఇంట్లో చోరీ జరిగింది. గురువారం ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనిపై ఆమె బెంగళూరుకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు శుక్రవారం వేకువజామున ఇంటి తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 16 తులాల బంగారు నగలు, రూ.40 వేల నగదు అపహరించుకెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి చేరుకున్న సుహాసిని చోరీ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై సీఐ రియాజుద్దీన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ఓబులమ్మ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలంలోని మేడాపురం పంచాయతీ పెద్ద మొగలాయపల్లికి చెందిన ఓబులమ్మ(110) శుక్రవారం మృతి చెందింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి చెందే వరకూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించిన ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మొత్తం నాలుగు తరాల వారసులను చూసి ఎంతో సంతోషించేది.

మత్స్య శాఖ ఉద్యోగి ఆత్మహత్య

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్ల డ్యాంలో ఉన్న మత్స్యశాఖ కేంద్రంలో ఫిషర్ మ్యాన్‌గా పనిచేస్తున్న అల్లాబకాష్ (54) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు పెనకచెర్ల డ్యాం నివాసి అయిన అల్లాబకాష్ మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక శుక్రవారం ఆయన మృతి చెందారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



జయరాములు (ఫైల్)

రాయదుర్గం టౌన్: పట్టణంలోని భంభం స్వామి లే అవుట్‌లో నివాసముంటున్న వద్ది జయరాములు(65) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పట్టణ శివారు బళ్లారి రోడ్డులో ఉన్న నగర వనంలో శుక్రవారం ఉదయం జయరాములు మృతదేహాన్ని అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. మృతి చెంది నాలుగు రోజులై నట్లుగా తెలుస్తోంది. జయరాములుకు ఇద్దరు కుమారులున్నారు. గత ఆదివారం సాయంత్రం నుంచి తమ తండ్రి కనిపించడం లేదని అప్పట్లో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నగర వనంలో జయరాములు మృతదేహం లభ్యం కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయిన జయరాములు ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగుతోంది.

ఐరన్ మార్ట్‌లో చోరీ



ఐరన్ మార్ట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

గుత్తి: స్థానిక అనంతపురం రోడ్డులోని సబిహా స్టీల్ అండ్ ఐరన్ మార్ట్‌లో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి తర్వాత ఓ దొంగ మార్ట్ షట్టర్‌ను ఐరన్ ర్యాడ్‌తో తెరచి లోపలకు ప్రవేశిస్తున్నట్లుగా సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమైంది. రెండు క్యాష్ బాక్స్‌ల్లోని సుమారు రూ. 33 వేలు నగదుతో పాటు ఓ సెల్‌ఫోన్‌ను దుండగులు అపహరించుకెళ్లాడు. ఘటనపై ఐరన్ మార్ట్ యజమాని కేఎస్ ఖాజా ఫిర్యాదు మేరకు సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్ షాప్‌ను పరిశీలించి, కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఇసుక దిబ్బల పరిశీలన

కణేకల్లు: మండలంలోని వేదవతి హగరి నదీ పరీవాహక ప్రాంతంలోని ఇసుక దిబ్బలను జెసెల్ షాఫ్ట్ ఫర్ ఇంటర్నేషనల్ జుసమ్మెనర్బీట్ (జీఐజెడ్) బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. కోనకుర్తి, మాల్యం, నాగేపల్లి, తుంబిగనూరు, గరుడచేడు, మీనహళ్లి, బిదరకుంతం గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో పర్వతాలను తలపించేలా ఏర్పడిన ఇసుక దిబ్బలను చూడగానే జీఐజెడ్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ గోపీనాథ్, అసిస్టెంట్ టెక్నికల్ నిపుణుడు సంతోష్, ప్లానింగ్ నిపుణుడు ప్రసాద్ ఆశ్చర్యపోయారు. వారి వెంట రాయదుర్గం ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు, ఏపీఓ సుధాకర్ ఉన్నారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై రోజురోజుకూ విస్తరిస్తున్న ఇసుక మేటల వల్ల కలిగే పంట నష్టాలపై, పంటల సాగుకు తలెత్తుతున్న అవాంతరాలను అడిగి తెలుసుకున్నారు. ఆషాఢంలో వేగంగా వీచే గాలి వల్ల ఇసుక తెరలు తెరలుగా లేచి పక్క భూముల్లో పడుతుందని రైతులు తెలిపారు. వేరుశనగ విత్తు మొదలు మొలకెత్తే వరకూ తామెంతో ఆందోళనతో గడపాల్సి వస్తోందన్నారు. ఇదే ఇసుక నల్లరేగడి భూములు, చౌడు భూములకు తరలించి ఆ భూమిపై పరిచి పంటలు సాగు చేస్తే మేలైన దిగుబడులు వస్తున్నాయని రైతులు తెలిపారు. అవసరమైన రైతులకు ఈ ఇసుకను తరలించే ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇసుక తరలింపుతోపాటు పలుచోట్ల రేగు, సరుగుడు, గోరింటాకు తదితర చెట్లను పెంచడం వల్ల కూడా ఎడారి నివారణకు సత్ఫలితాలిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఎడారి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు జీఐజెడ్ బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్ ఏపీఓ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు సోమన్నగౌడ్, హరి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.